# కథ

**ఆదుర్తి బాల**

# క్షమించు సురేఖా!

**హైదరాబాద్ వెళ్లే శాతవాహన ఎక్స్‌ప్రెస్ కోసం ప్లాట్‌ఫామ్ మీద వెయిట్ చేస్తున్నాడు ఉదయ్. మర్నాడే అతడి అన్నయ్య ఇంటి గృహప్రవేశం. మార్గశిరమాసపు మంచుగాలుల నుండి రక్షించి అతడి గుండెని వెచ్చబరుస్తోంది భార్య సురేఖా అల్లి ప్రేమతో ప్రజంట్ చేసిన ఊలు స్వెట్టర్. భార్య గుర్తుకు రాగానే అతడి మనసు మధురోహలతో నిండిపోయింది.**

భార్య సురేఖ అంటే అతడికి ప్రాణం. ఆమె తోడు లేకుండా ఈ ఒంటరి ప్రయాణం అతడికిష్టం లేదు. కానీ ఈమధ్యే జ్వరపడి ఇప్పుడే కోలుకుంటున్న భార్య చేత ప్రయాణం చేయించడం అతడికిష్టం లేకపోయింది. అందుకే ఊళ్లోనే ఉంటున్న ఆమె పిన్నిగారింట్లో భార్యని దించి తనొక్కడే ప్రయాణమయ్యాడు.

ఇంకొద్ది నిమిషాల్లో శాతవాహన ఎక్స్‌ప్రెస్ ప్లాట్‌ఫాం మీదకొస్తుందన్న ఎనౌన్స్‌మెంట్ వినగానే అంతవరకూ అక్కడక్కడా కూర్చొని పిచ్చాపాటి మాట్లాడుకున్న ప్రయాణీకులలో ఒక్కసారిగా అలజడి రేగింది. పెట్టె బేడా పిల్లా జెల్లాని పట్టుకొని ట్రైనింకా అంత దూరంలో ఉండగానే ఒకర్నొకరు తోసుకోవడం మొదలుపెట్టారు. ఉదయ్ కూడా ఆ జనప్రవాహంలో ఒకడై తన ప్రమేయం లేకుండానే వెనుక వాళ్లు నెట్టేస్తుంటే ట్రైన్‌లోకొచ్చి పడ్డాడు. ట్రైనెక్కాక సీటు కోసం చూశాడు కానీ అప్పటికే సీట్లన్నీ ప్రయాణీకులతో నిండిపోయాయి. ఎవరైనా జరిగి కాస్త చోటిస్తారేమోనని చూశాడు ఉదయ్. ఇంతలో ఎవరో మాస్టారూ ఇటు రండి అన్నట్టు వినిపించి అటు చూశాడు.

కిటికీ పక్కన కూర్చున్నాడతడు. చామన ఛాయ, గిరజాల జుట్టు, పొడవైన ముక్కు ఎక్కడో చూసిన మొఖంలాగే ఉన్నాడు. నవ్వుతూ చెయ్యి ఊపుతూ తననే పిలుస్తున్నాడు. చివరి వరకూ కాలిన సిగరెట్‌ని కిటికీలోంచి బైటకి విసిరి తను జరిగి ఉదయ్‌కి చోటిచ్చాడు.

''మీ పేరు ఉదయ్ కదూ'' ఉదయ్ వంక తిరిగి అన్నాడతడు. సిగరెట్ వాసన గుప్పుమంది.

తలూపాడు ఉదయ్.

''నేను రమేష్‌నండి. మా తమ్ముడు సురేష్‌కి మీరు ట్యూషన్ చెప్పేవారు. మీరపుడు సత్యనారాయణపురం గడియారం వారి వీధిలో ఉండే వాళ్లు'' గుర్తు చేశాడతడు.

ఎప్పుడో పదిహేనేళ్ల క్రితం మాట. అప్పుడు తను ఇంటర్ చదివేవాడు. చిన్న క్లాసులకి ట్యూషన్స్ చెప్పి పాకెట్ మనీ సంపాదించుకునేవాడు. తమ ఇంటికి నాలుగిళ్ల అవతల ఉన్న సురేష్ తన దగ్గర ట్యూషన్ చెప్పించుకోడానికి వచ్చేవాడు. అప్పుడపుడూ తమ్ముడి కోసం వస్తూండేవాడు రమేష్.

లీలగా గుర్తొచ్చింది ఉదయ్‌కి.

''ఇపుడేం చేస్తున్నారు సార్'' అన్నాడు రమేష్.

''కార్పొరేషన్ బ్యాంకులో పనిచేస్తున్నాను. మా అన్నయ్య గృహప్రవేశమంటే హైదరాబాద్ వెడుతున్నాను. అన్నట్టు మీ తమ్ముడేం చేస్తున్నాడు. లెఖ్ఖల్లో మహా చురుకువాడు'' అన్నాడు ఉదయ్.

**ఒక్క క్షణం నిశ్చేష్టురాలైంది సురేఖ. అంతలోనే సర్దుకొని ఆ కవరుని జాగ్రత్తగా టీపాయ్ మీద పెట్టింది. ''ఈ రిపోర్ట్స్ వెనుక ఓ పెద్ద కథే ఉంది అలా కూర్చోండి చెప్తాను'' నింపాదిగా అన్నది.**

''వాడికేంలెండి సాఫ్ట్‌వేర్ ఇంజనీర్రై మహారాజులా బతుకుతున్నాడు. నా జాతకమే ఇలా ఏడిచింది'' నిర్లిప్తంగా అన్నాడు రమేష్.

''అలా అంటారేంటి ఇంకా మంచి జాబ్ రాలేదా''

''ఇప్పుడింక మంచి జాబేం వస్తుందిలెండి. హాయిగా చదూకొనే వయసులో అల్లరిగా తిరిగాను. ఇందులో నా తప్పే కాదు నా తల్లితండ్రులకీ భాగముంది లెండి. నాకు మంచీ చెడూ చెప్పి సరైన దార్లో పెడితే నేనూ ఈపాటికి మంచి చదువే చదూకునేవాడిని. నా తల్లిదండ్రులు నన్ను సరిగా పట్టించుకోలేదు. డిగ్రీ మూడుసార్లు తప్పాను. ఇపుడు మా మామయ్య హైదరాబాద్‌లో ఏదో ప్రైవేటు కంపెనీలో చిన్న జాబ్ వేయిస్తానంటే వెడుతున్నాను'' ఇంకొక సిగరెట్ తీసి వెలిగించుకుంటూ అన్నాడు రమేష్.

సిగరెట్ వాసనకి అప్రసన్నంగా మారిన ఉదయ్ వంక చూసి ''సారీ సర్ ఇది లేకపోతే నాకు తోచి చావదు'' అంటూ ట్రైన్ కిటికీ కేసి తిరిగి సిగరెట్ కాల్చడం మొదలుపెట్టాడతడు. ఆ తరువాత వారి మధ్య మాటలు జరగలేదు.

ట్రైను వరంగల్ స్టేషను సమీపిస్తుండగా టి.టి. వచ్చాడు. జేబులో ఉన్న పర్స్ తీసి టికెట్ తీసి చూపించాడు ఉదయ్. టికెట్ తీసినపుడు కిందకి జారిపడ్డ సురేఖ ఫోటోని గమనించలేదతడు. భార్య ఫోటోని ఎప్పుడూ పర్స్‌లో దాచుకొని చూసుకోవడం ఉదయ్‌కి ఇష్టం. కింద పడ్డ ఫోటో వంకే తదేకంగా చూస్తూ వంగి తీశాడు రమేష్.

''ఈమె పేరు సురేఖ కదూ'' అన్నాడు ఫోటో ఉదయ్‌కిస్తూ.

తలూపాడు ఉదయ్.

''ఈమె మీకేమవుతారు?''

''నా భార్య'' చెప్పాడు ఉదయ్.

పక్కలో బాంబు పడ్డట్టు ఉలిక్కిపడ్డాడు రమేష్.

''సురేఖ మీ భార్యా... తెలిసీ చేసుకున్నారా''

''మీరేమంటున్నారో నాకు తెలియట్లేదు'' అయోమయంగా అన్నాడు ఉదయ్.

''అంటే పెళ్లికి ముందు ఆమె తన గురించి మీకేం చెప్పలేదా''

''కొంచెం అర్థమయ్యేటట్టు చెప్పండి'' విసుగుని దాచుకుంటూ అన్నాడు ఉదయ్.

రమేష్ చెప్పడం మొదలుపెట్టాడు.

''మీ భార్య హెచ్.ఐ.వి. పేషంటు. నాకెలా తెలుసని ఆశ్చర్యపోకండి. నేనామెని ప్రేమించాను. ఆమెకి ఆ జబ్బు లేకపోతే ఈపాటికి నా భార్య అయి ఉండేది. కావాలంటే ఇంటికెళ్లాక మీ భార్యని ఈ విషయం నిలదీయండి. నిజానిజాలు తెలుస్తాయి. ఇంకా మీకు నమ్మకం కుదరకపోతే సూర్యారావుపేటలో ఉన్న డాక్టర్ ప్రతాప్‌ని కలుసుకోండి. ఆయన

టెస్ట్ చేసి ఇచ్చిన రిపోర్ట్స్ చూడండి''

ఉదయ్‌కి ప్రపంచమంతా గిర్రున తిరిగినట్లయింది. తను ప్రాణప్రదంగా ప్రేమించిన భార్య ఇంత మోసం చేసిందంటే అతడికింకా నమ్మకం కుదరట్లేదు.

అన్యమనస్కంగానే అన్నయ్య ఇంటి ఫంక్షన్‌కి హాజరయ్యాడు. ఇంటికి వచ్చాక కూడా భార్యతో ఆ విషయం ఎలా ప్రస్తావించాలో అర్థం కావట్లేదతడికి. రమేష్ చెప్పింది కూడా నిజమని గ్యారంటీ ఏమిటి? నిజం తెలుసుకోవాలంటే డాక్టరు ప్రతాప్ ఇచ్చిన రిపోర్ట్స్ మాత్రమే శరణ్యం. కానీ అవి ఇంతకాలం సురక్షితంగా ఉంచుతుందా సురేఖ? తన కంట బడకుండా అవి ఎప్పుడో చింపేస్తే తనిపుడు ఏం చెయ్యాలి? తను ప్రాణ సమానంగా ప్రేమించిన భార్యని నిజానిజాలు తెలుసుకోకుండా నిలదియ్యడం ఉదయ్‌కి ఇష్టం లేకపోయింది.



ఎప్పుడూ నవ్వుతూ, తన వెనకే తిరిగి కొంటె పనులు చేస్తూ, తనకి చిరుకోపం తెప్పించి అంతలోనే నవ్విస్తూ అల్లరి చేసే భర్త ముభావంగా ఎందుకుంటున్నాడో అర్థం కావట్లేదు సురేఖకి. తన దిగులు కొంతైనా తీరుతుందని కాసేపు ఫ్రెండు ఇంటికెళ్లి కబుర్లు చెప్పుకోవాలనిపించింది సురేఖకి. అందుకే తను ఆ రోజు ఫ్రెండింటికెళ్లొస్తానని ఉదయ్‌తో చెప్పింది సురేఖ. భార్య అటు గడపదాటిందో లేదో తలుపు గడియ పెట్టుకున్నాడు ఉదయ్. డాక్టర్ ప్రతాప్ ఇచ్చిన భార్య తాలూకు రిపోర్ట్స్ ఎక్కడైనా దొరుకుతాయేమోనని ఇల్లంతా వెదకడం మొదలుపెట్టాడు. ఓ అరగంట ప్రయత్నించాక భార్య బీరువాలో చీరమడతల కింద భద్రంగా దాచిన పెద్ద కవరు కనిపించింది ఉదయ్‌కి. అందులో పదిలంగా ఉన్న మెడికల్ రిపోర్ట్స్ చదవసాగాడు ఉదయ్. అతని మొఖంలో రంగులు మారడం మొదలైంది. మొత్తం చదివిన తరువాత నిస్సత్తువగా కుర్చీలో కూలబడ్డాడు ఉదయ్. పేద పిల్ల అయినా, కట్నం ఇవ్వలేరని తెలిసినా కోరికోరి సురేఖని చేసుకున్నందుకు మంచి గుణపాఠమే చెప్పింది తనకి. బాధగా అనుకున్నాడు ఉదయ్.

సురేఖ రాగానే తనకింత అన్యాయం ఎందుకు చేసిందో కనుక్కోవాలని నిశ్చయించుకున్నాడు ఉదయ్.

ఇంటికి వస్తూనే భోజనానికి అన్నీ డైనింగ్ టేబుల్ మీద సర్దడం మొదలుపెట్టింది సురేఖ.

''రేఖా! ఇలారా'' ఎన్నో యుగాల తరువాత విన్నట్టుగా అనిపించింది సురేఖకి భర్త పిలుపు. చేతిలో పని వదిలేసి పరిగెత్తుకొచ్చింది.

''అలా కూర్చో'' కుర్చీ చూపించాడు ఉదయ్.

బొమ్మలాగా కుర్చీలో కూర్చొని భర్త ఏం చెప్తాడా అని చూస్తోంది సురేఖ.

''మన పెళ్లయిన మొదటి రాత్రి మనిద్దరం ఒక ఒప్పందం చేసుకున్నాం గుర్తుందా?'' ఉపోద్ఘాతంలా అన్నాడు ఉదయ్.

''మన మధ్య ఏ రహస్యాలూ ఉండకూడదనుకున్నాం'' బదులుగా అన్నది.

''గుడ్ బాగానే గుర్తుందన్నమాట. మరి ఈ విషయం దాచి నన్నెందుకు మోసం చేశావ్?'' డాక్టర్ ప్రతాప్ ఇచ్చిన మెడికల్ రిపోర్ట్స్ ఆమె మీదకి విసిరికొడుతూ అన్నాడు ఉదయ్.

ఒక్క క్షణం నిశ్చేష్టురాలైంది సురేఖ. అంతలోనే సర్దుకొని ఆ కవరుని జాగ్రత్తగా టీపాయ్ మీద పెట్టింది.

''ఈ రిపోర్ట్స్ వెనుక ఓ పెద్ద కథే ఉంది అలా కూర్చోండి చెప్తాను'' నింపాదిగా అన్నది.

భార్య చెప్పే కథేమిటో తెలుసుకోడానికి ఉద్యుక్తుడవుతూ కూర్చున్నాడు ఉదయ్. చెప్పడం మొదలు పెట్టింది సురేఖ.

''మాది మధ్య తరగతి కుటుంబం. నేనే ఇంట్లో పెద్ద కూతుర్ని. నాన్నగారు త్వరలోనే రిటైరవ్వబోతున్నారు. నా తరువాత తమ్ముడు, చెల్లి చదువు బాధ్యత నామీదుంది. అమ్మకెపుడూ అనారోగ్యం. పూజలూ, ఉపవాసాలూ అంటూ వేళకి తినక ఆరోగ్యం చెడగొట్టుకుంది. నాన్న జీతంలో డాక్టరు బిల్లులు, అమ్మ మందులకే చాలా అయిపోయేది. నెలకొకసారైనా పిల్లల్ని తీసుకొని వచ్చేవాళ్ళ అత్తయ్యలు. వచ్చిన వాళ్ళు పది రోజులకి తక్కువ ఉండేవారు కాదు. ఇన్ని ఖర్చులు భరిస్తూ మాకు చదువులు చెప్పించడం, పెళ్ళిళ్ళు చేయడం నాన్నకి తలకిమించిన భారమని నాకు తెలుసు. అందుకే నా శాయశక్తులా నాన్నని ఆదుకోవడం నా తరువాత వాళ్ల బాధ్యత తీసుకోవడం ఇంటి పెద్ద కూతురుగా నా ధర్మం అని తలిచాను. నా ధర్మం నెరవేర్చాలంటే ముందు మంచి ఉద్యోగం సంపాదించుకోవాలనున్నాను. మంచి మార్కులతో పాసైతే కానీ మంచి జాబ్ రాదు. అందుకే చదువే లోకంలా భావించి శ్రద్ధగా చదూకుని మంచి మార్కులతో డిగ్రీ సెకండ్ ఇయర్ అయిందనిపించాను. ఇంకొక్క ఏడాదిలో నా చదువై ఒడ్డున పడతానని సంతోషిస్తున్న సమయంలో నా పాలిట విలన్‌లా ప్రత్యక్షమయ్యాడు రమేష్. నన్ను ప్రేమిస్తున్నానని వెంటపడే వాడు. తనని ప్రేమించమని వేధించేవాడు. మొదట్లో వాడిని తప్పించుకుని తిరిగేదాన్ని. రానురానూ అతడిని తప్పించుకోవడం అసాధ్యమైపోయింది. నా కోసం దారి కాసి అడ్డగించే వాడు. వాడి వేధింపుల వల్ల ఒక్కోసారి చదువు మీద దృష్టి పెట్టలేకపోయేదాన్ని. ఓ రోజు జరిగిన సంఘటనతో నేను పూర్తిగా భయపడిపోయాను. ఆ రోజు నేను కాలేజీ నుండి ఇంటికి తిరిగి వస్తూ మా ఇంటి సందు మలుపు తిరిగానో లేదో ప్రత్యక్షమయ్యాడు రమేష్. అతడి చేతిలో తళతళ మెరిసిపోతోంది కత్తి. తనని ప్రేమించానని చెప్పకపోతే ఆ కత్తితో పొడిచి చంపేస్తానని బెదిరించాడు. నాకేం చెయ్యాలో తోచలేదు. ఒక్కరోజు గడువివ్వమని బతిమాలాను. సరే అన్నాడతడు. బతుకుజీవుడా అనుకుంటూ ఇల్లు చేరాను. అతడి గురించి ఇంట్లో చెపుదామనుకున్నాను. కానీ అందువల్ల నాకు ఒరిగేదేమిటి? నన్ను చదువు మాన్పించి ఇంట్లో కూర్చోపెడతారు. పోనీ పోలీస్ కంప్లైంట్ ఇద్దామన్నా వాళ్ళు మాత్రం ఏం చేస్తారు. ఒకసారి అతడిని హెచ్చరించి వదిలేస్తారు. లేకపోతే ఒకసారి దేహశుద్ధి చేసి పంపిస్తారు. అంతేకానీ బైటకెళ్ళినప్పుడల్లా ఏ రాజకీయ నాయకుడికిచ్చినట్టో పోలీస్ ప్రొటెక్షన్ ఇవ్వలేరు కదా నాకు. ఎటు చూసినా నా లక్ష్యం నెరవేర్చుకోడానికి ఇవి సరైన మార్గాలుగా తోచలేదు నాకు. బాగా ఆలోచించిన తరువాత వాడి పీడ వదిలించుకోడానికి ఒక మార్గం తోచింది నాకు. నా ఫ్రెండు భార్గవిని సంప్రదించి దాని సహాయంతో వాళ్ల మామయ్య డాక్టర్ ప్రతాప్‌గారిని కలిసి నా పరిస్థితి వివరించాను. నాకు హెచ్.ఐ.వి. ఉన్నట్టుగా తప్పుడు రిపోర్ట్స్ తయారుచేసివ్వమని బతిమాలాను. అలా చేయకూడదని తెలిసినా కేవలం నాకు హెల్ప్ చేయాలనే ఉద్దేశ్యంతోటే ఆయన అందుకు ఒప్పుకున్నారు. నా పర్పస్ తీరగానే ఆ మెడికల్ రిపోర్ట్స్ చింపివేయమని కండిషన్ పెట్టారాయన. నేను సరేనన్నాను. ఆ తరువాత రమేష్‌ని కలుసుకుని నేను హెచ్.ఐ.వి. పేషెంటునని చెప్పి అతడిని నమ్మించడానికి ఆ రిపోర్ట్స్ చూపించాను. నా మాటలు నమ్మి నా జోలికి రావడం మానేశాడతడు. ఆ తరువాత నా చదువు నిర్విఘ్నంగా పూర్తిచేసుకుని నేను కోరుకున్నట్టుగానే మంచి ఉద్యోగం సంపాదించుకున్నాను. ఏ వ్యాధి సోకితే జనం మరణశాసనమని భయపడతారో ఆ వ్యాధే నా లక్ష్య సాధనకి ఊపిరిపోసే సంజీవని అయింది. అందుకే ఆ మెడికల్ రిపోర్ట్స్‌ని పదిలంగా దాచుకున్నాను. ఇప్పుడు చెప్పు ఉదయ్ నేను చేసింది తప్పా'' అన్నది సురేఖ.

''లేదు రేఖా ఇది నీ తప్పు కాదు. బాధ్యత గల పౌరులుగా తయారుచేయాల్సిన పిల్లల్ని నిర్లక్ష్యంగా వదిలేసి వాళ్ళు రౌడీలుగా, జులాయిగా తయారుచేసే కొందరు తల్లిదండ్రుల తప్పు. అమ్మాయిలని ఏడిపించడం, లెక్చరర్స్‌ని వెక్కిరించడం, కాపీకొట్టి పరీక్షలు రాయడమే హీరోయిజంగా చూపించే సినిమాలు తీసి యువతరాన్ని పెడదోవ పట్టించే కొందరు నిర్మాతలూ ఇందుకు బాధ్యులే. ఎక్కడ అన్యాయం జరిగినా కలిసికట్టుగా ప్రశ్నించలేని మనందరం కూడా ఇలాటి సంఘటనలు జరగడానికి బాధ్యులమే. లేకపోతే ప్రేమించలేదన్న కారణంగా అమ్మాయిలను చంపేసే రాక్షసులెందుకు వస్తారు మన మధ్యకు? ఓ రాక్షసుడి కత్తికి బలయి నీ కుటుంబాన్ని దుఃఖంలో మునిగిపోకుండా నీ తెలివితో నిన్ను నువ్వు రక్షించుకున్నావు. ఇందులో నీ తప్పేం లేదు తరచి చూస్తే నాదే తప్పనిపిస్తోంది''

''మీ తప్పా ఏమిటది?'' భర్త మాటలు అర్థం కాక అడిగింది సురేఖ.

''నీవెలాంటి దానివో తెలిసీ, నీ మీద ఇంత ప్రేమ ఉండి కూడా నిన్ను అనుమానించడం నా తప్పు కదూ. సూటిగా నిన్నడిగేసి నిజం తెలుసుకోకుండా చాటుగా నీ హెల్త్ రిపోర్ట్స్ చదవడం నేను చేసిన ఘోరం కదూ. అన్నిటికన్నా పెద్ద తప్పేంటో తెలుసా మధురక్షణాలుగా కరగవలసిన రాత్రులని నిస్సారంగా మార్చి నిన్ను బాధించాను. మరలిపోయిన కాలాన్ని తిరిగి తీసుకురాలేను. కానీ మనం నష్టపోయిన రాత్రుల అనుభవాలని భర్తీ చేయడానికి ఓ వారం రోజులు ఆఫీసుకి సెలవు పెట్టి బెడ్‌రూంలో ఓవర్‌టైమ్ డ్యూటీ చెయ్యమంటావా'' కొంటెగా నవ్వుతూనే ఉన్నాడు ఉదయ్.

భర్త మాటల్లో అంతర్యం అర్థమై అతడి చూపుల్లో కొంటెతనానికి ముద్దులా సిగ్గుతో కనులు వాల్చింది సురేఖ.

## అమెరికాలో లయ

**పెళ్లయినా కూడా వెంటనే వీసా దొరకని కారణంగా అమెరికాలోని తన భర్త దగ్గరకెళ్లలేక పోయిన లయ ఎట్టకేలకు ఇప్పుడు అమెరికా చేరుకుంది. పెళ్లి తర్వాత ఇక్కడే వుంటూ టీవీ యాంకర్‌గా కూడా దర్శనమిచ్చిన లయ మళ్లీ ఇప్పట్లో ఇండియాకి రాలేకపోచ్చునంది. పెళ్లి తర్వాత సినిమాలకి గుడ్‌బై చెప్పేసిన లయ, శాస్త్రీయ నృత్యకారిణిగా మాత్రం అవకాశం లభించినప్పుడల్లా నాట్యప్రదర్శనలివ్వాలనుకుంటున్నట్టు సెలవిచ్చిన లయ ఇక ఇల్లాలిగా బిజీగా వుంటుందన్నమాట.**

